
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 । కనిష్ఠం 21.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
ఆదివారం 25 మే 2025



28 వరకే జొన్నల కొనుగోళ్లు

కామారెడ్డి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జొన్న పంట కొనుగోళ్లు ఈ నెల 28 వరకు మాత్రమే చేపడతామని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి మహేష్‌కుమార్ తెలిపారు. రైతులు ఈనెల 27 లోపు పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో 71,104 ఎకరాల్లో జొన్న పంట వేయడం జరిగిందని, క్వింటాల్‌కు రూ.3,371 ధర చెల్లించామని తెలిపారు. ఇప్పటి వరకు 10,999 మంది రైతుల నుంచి 28,498 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశామని తెలిపారు.



తడిసిన ధాన్యాన్ని సేకరిస్తున్న మహిళా రైతు



భిక్కనూరులో తడిసిన ధాన్యంతో నిరసన తెలుపుతున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని ఆర బోస్తున్న రైతులు

కొనుగోళ్లలో.. తప్పని తిప్పలు!

- అకాల వర్షాలతో కొనుగోళ్లకు అడ్డంకులు
- కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రాల్లో తడిసిపోతున్న ధాన్యం
- కొనుగోళ్లు తొందరగా చేయాలంటూ రోడ్డెక్కుతున్న రైతులు
- జిల్లాలో తుది దశకు చేరిన కొనుగోళ్లు
- 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

కామారెడ్డి, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు చివరి దశకు చేరాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో అక్కడక్కడ కొనుగోళ్లు జరుగుతున్నాయి. కానీ అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుండగా మరోవైపు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఆటంకాలు ఎదురవుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు కొనుగోలు కేంద్రాలతో పాటు పంట పొలాల్లో ఉన్న ధాన్యం తడిసి ఎండుతున్నాయి. ధాన్యం రంగు మారుతుండడంతో కొనుగోలు చేస్తారో లేదోనని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జిల్లాలో వేల క్వింటాళ్లలోనే ధాన్యం తడిసిపోయింది. కొనుగోళ్లు వెనువెంటే చేయాలని రైతులు ఆందోళన చేస్తూ రోడ్డెక్కుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

ధాన్యం తడుస్తూ.. ఎండుతూ..

జిల్లాలో ఇటీవల వరుసగా అకాల వర్షాలు కురుస్తునే ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలతో కేంద్రాల్లో, పంట పొలాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దవుతోంది. కురుస్తున్న అకాల వర్షాలకు కామారెడ్డి, అడ్లూర్ ఎల్లారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు కురిశాయి. దీంతో మార్కెట్ యార్డులో, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. వరదతాకిడికి పలు చోట్ల ధాన్యం కొట్టుకుపోవడం, కుప్పల మధ్య వరద నీరు నిలిచిపోవడంతో ఆ వరద నీటిని తొలగించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ధాన్యాన్ని ఆరబోయగా సాయంత్రం, రాత్రి కల్లా వర్షాలు కురువడంతో ధాన్యం తడిసి పోతుందని మరుసటి రోజు ఎండకు ఆరా బోస్తే సాయంత్రం కల్లా వర్షంతో మళ్లీ ధాన్యం తడిసి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తడిసిపోవడంతో రంగు మారుతుందని కొనుగోళ్లు చేస్తారో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నెలకొంటుందని రైతులు మండి పడుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వెనువెంటే కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కేంద్రాల్లో రైతులకు నిరీక్షణ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అకాల వర్షాల వల్ల జాప్యం నెలకొంటుంది. తెరుచుకున్న కేంద్రాల్లోని ధాన్యం రాశులు కుప్పలుగా దర్శన మిస్తున్నాయి. కొనుగోళ్ల కోసం రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. తేమ శాతం వచ్చేందుకు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని ఆర బెడుతున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం కాస్త తడిసిపోతోంది. దీంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడం లేదని రైతులు మండి పడుతున్నారు. ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు టార్పాలిన్‌లు, బార్దన్‌లు అందుబాటులో ఉండడం లేదని దీంతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపో తుందని తడిసిన ధాన్యాన్ని అర బెట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డెక్కుతున్న రైతులు

ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు చేయాలంటూ ధాన్యం తడిసిపోతుందంటూ రైతులు కొన్ని చోట్ల రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. వరుసగా కురుస్తున్న అకాల వర్షాలకు భిక్కనూరు మండల ంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవ డంతో కొనుగోళ్లు చేయడం లేదని రైతులు రోడ్డెక్కారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, లారీలు రావడం లేదం టూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బీబీపేట, ఎల్లారెడ్డి, మాచారెడ్డి మండలాల్లోనూ రైతులు ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కి రాస్తారోకో చేపట్టారు.

జిల్లాలో 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

ఈ యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం తరపున 446 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇప్పటికే బాన్సువాడ డివిజన్ పరిధిలో కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తవడంతో మూసి వేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 70,544 మంది రైతుల నుంచి రూ.857 కోట్లు విలువ చేసే 3,67,451 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 90 శాతం మేర రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేసి రూ.763 కోట్ల ధాన్యం డబ్బులను 56,541 మంది రైతుల ఖాతాలో జమ చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో సన్నలు 1,78,184 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నాల బోనస్ ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశిస్తున్నారు. మరో పక్షం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

బీర్కూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా షైలారం గ్రామానికి చెందిన చుక్క దస్తాగౌడ్ అనే భక్తుడు అన్నదాన కార్యక్రమం కోసం రూ.25వేలు ఆలయ ధర్మకర్త శంభురెడ్డికి అందజేశారు. అన్నదాతకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకన్న, నరసరాజు, ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

రూ. 2,72,759 నగదు లభ్యం

రామారెడ్డి, మే 24 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో గల తొమ్మిది హుండీలను శనివారం లెక్కింపు నిర్వహించారు. రూ.2,72,759 నగదు, బంగారు, వెండి ఆభరణాలు వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లాల దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.విజయరామరావు, కార్యనిర్వాహణాధికారి బూర్ల ప్రభ రామచంద్రం గుప్తా నేతృత్వంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, భక్త బృందం, మహిళా సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. శనివారం ఎస్పీ రాజేష్‌చంద్రతో కలిసి వ్యవసాయ, పోలీసుశాఖలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 34వేల పత్తి సాగవుతుందని అంచనా ఉందని నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు చేపట్టాలని, బాధ్యులపై సంబంధిత చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయాలని సూచించారు. అధీకృత లైసెన్స్‌లు లేని కంపెనీలు ఉత్పత్తి చేసిన, విక్రేత వద్ద ఉన్న, తెల్ల సంచులలో నింపిన, లేబుల్ సరిగా లేని, నకిలీ లేబుల్ విడిగా ఉన్న, రాత్రి గ్రామాల్లో వచ్చిన తెలియని వ్యక్తుల వద్ద ఉన్నవి, గడువు తేది ముగిసిన, మొలక శాతం తక్కువ, జన్యూ స్వచ్ఛత లేని విత్తనాలను నకిలీ విత్తనాలుగా గుర్తించాలని తెలిపారు. జిల్లాలో ఐదు టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని గత సంవత్సరం నష్టపోయిన గ్రామాల రైతుల వివరాలు వ్యవసాయ విస్తీర్ణాధికారుల నుంచి సేకరించాలని తెలిపారు. రైతులను చైతన్య పరచడానికి వివరాలు ఉన్న కర పత్రాలు అందించాలని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం, పంచాయతీ కార్యదర్శుల ద్వారా తనిఖీలు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలను అమ్మే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీంలు ఇలా ఉన్నాయి. జిల్లా టాస్క్ ఫోర్స్ టీంలో డీఏవో తిరుమల ప్రసాద్, ఏఎస్పీ నర్సింహారెడ్డి, సీడ్ సర్టిఫికెట్ ఆఫీసర్ నగేష్, బాన్సువాడ డివిజన్ పరిధి టీంలో ఏడీఏ అరుణ, సీఐ రాజేష్, ఏవో, బిచ్కుంద టాస్క్‌ఫోర్స్ టీంలో ఏడీఏ అరుణ, ఏవో అమర్‌ప్రసాద్, సీఐ నరేష్, ఎల్లారెడ్డి డివిజన్ పరిధి టీంలో ఏడీఏ రత్నం, ఏవో నదీ మొహ్దీన్, సీఐ రవీందర్, కామారెడ్డి డివి జన్ పరిధిలో ఏడీఏ అపర్ణ, ఏవో పవన్ కుమార్, సీఐ సంపత్ కుమార్‌లు ఉన్నారు. నకిలీ విత్తనాలపై సమాచారం తెలియ చేయడానికి 89777 46219 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చైతన్యారెడ్డి, వ్యవసాయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాలు, తెగలపై నమోదైన కేసులపై విచారణ వేగం చేయాలి

షెడ్యూల్ కులాలు, తెగలపై జరిగే దాడులకు సంబంధించి నమోదైన కేసులపై వేగవంతంగా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులకు సంబంధించి నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో మారుమూల గ్రామాల్లో మూఢ నమ్మకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం చే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధిం చిన పీడన నిరోధక చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాధితులకు చట్ట ప్రకారం పరిహారం నిధుల కేటాయింపుల మేరకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కోర్టు స్టే కారణంగా కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాలో మూఢ నమ్మకాలపై పోలీసు కళాజాత బృందాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ వీణ, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఎస్పీలు, ఎన్‌జీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా అకాడమీ, వసతి గృహాల్లో ప్రవేశాల ఎంపిక

కామారెడ్డి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను రీజినల్ స్పోర్ట్స్ వసతి గృహాల్లో, అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాశాఖాధికారి జగన్నాథన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 1 నుంచి 13 వరకు ఉదయం 7 గంటల నుంచి అకాడమీలో ఎంపికలు నిర్వహించబడుతాయని తెలిపారు. వాలీబాల్ (బాలిక, బాలుర) ఎంపిక అండర్ 14 టూ 16 మధ్య వయస్సు గల వారిని జూన్ 1న సిద్దిపేట వాలీబాల్ అకాడమీలో, సైక్లింగ్ అండ్ వ్రెస్లింగ్(బాలుర) ఎంపిక అండర్ 14 నుంచి 16 మధ్య వయస్సు గల వారిని ఓయూ క్యాంపస్ జూన్ 10, 11న, జిమ్నాస్టిక్స్ (బాలుర, బాలికలు), స్విమ్మింగ్ (బాలుర), అథ్లెటిక్స్ (బాలుర), హ్యాండ్‌బాల్ (బాలుర), వ్రెస్లింగ్ (బాలుర) ఎంపిక అండర్ 10 నుంచి 12 మధ్య వయస్సు గల, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ అండర్ 14 నుంచి 16 మధ్య వయస్సు గల వారు జూన్ 10, 11న హనుమకొండ జేఎన్ స్టేడియం, వాలీబాల్ అండర్ 16 నుంచి 18, అండర్ 14 నుంచి 16 మధ్య వయస్సు గల వారు రాజన్న సిరిసిల్లా జిల్లాలోని వాలీబాల్ అకాడమీలో జూన్ 10న, హాకి (బాయ్స్) అండర్ 14 నుంచి 16 మధ్య వయస్సు గల వారు వనపర్తి హాకీ అకాడమీలో జూన్ 12, అథ్లెటిక్స్(బాయ్స్) ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జూన్ 12, వాలీబాల్ (బాయ్స్ అండ్ గర్ల్స్) మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో జూన్ 12, 13న ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 నుంచి 12 సంవత్సరాలలోపు జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, 12 నుంచి 16 సంవత్సరాలలోపు అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, హాకీ, వాలీబాల్, కుస్తి, 14 సంవత్సరాలలోపు ఉన్నవారు జిమ్నాస్టిక్ బాలుర ఎంపికలకు అర్హులని తెలిపారు. వాలీబాల్ ప్రవేశానికి అండర్ 14 నుంచి 16 బాలుర 182 సెం.మీలు, బాలికలు 166 సెం.మీలు, అండర్ 16 నుంచి 18 బాలురు 186 సెం.మీలు, బాలికలు 170 సెం.మీలు ఉండాలని తెలిపారు. ఎంపికలో పాల్గొనే జిల్లా స్థానిక బాలురు, బాలికలు క్రీడల నందు ఆసక్తి గలవారై ఉండాలని తెలిపారు. వయస్సు, స్టడీ సర్టిఫికెట్స్, బర్త్ సర్టిఫికెట్, 10 లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డులతో పాల్గొనాలని తెలిపారు. మిగిలిన వివరాల కోసం కలెక్టరేట్‌లోని 223 రూమ్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

కామారెడ్డి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామపాలన అధికారి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 25న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్న పత్రాలను తరలించాలని తెలిపారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జెఎన్‌టీయూహెచ్‌కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సిట్టింగ్ అరెంజ్‌మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన తాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్లను నియమించాలని తెలిపారు. గ్రామపాలన అధికారుల ఎంపిక కోసం నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. జిల్లాలో 401 మంది ఈ పరీక్ష రాయనున్నారని తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అనధికార వ్యక్తులను పరీక్ష కేంద్రంలోని అనుమతించబడదని, అభ్యర్థులను నిశిత పరిశీలన చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, గాడ్జెట్‌లను అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, పరిశీలకులు శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నకిలీ విత్తన విక్రయాలకు సన్నద్ధం!

- లైసెన్స్ లేకున్నా విక్రయాలకు ప్లాన్
- మండల కేంద్రంలో గోదాం ఏర్పాటు
- గోదాం నుంచే గ్రామాలకు తరలింపు
- గతంలో పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో గోదాం
- విక్రయదారులను పట్టించుకోని అధికారులు

దోమకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా విత్తనాలను, వివిధ రకాల పురుగు మందులను గ్రామాల్లో తిరుగుతూ కొందరు వ్యక్తులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి మరో వారం రోజుల సమయం ఉంది. పంటలు వేయడానికి రైతులు దుక్కులు దున్ని పంటలకు అనువుగా ఉండేందుకు నేలను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే గతంలో గ్రామాల్లో తిరుగుతూ వివిధ కంపెనీల ఉద్యోగులు (మహిళలు, పురుషులు) వరి, పత్తి, ఇతర పంటలకు సంబంధించిన పురుగు మందులు, గంట మందులు, గడ్డి మందులు రైతులకు విక్రయించారు.

రైతులకు విత్తనాలు అందించేందుకు సిద్ధమవుతున్న కంపెనీ ఉద్యోగులు

తెల్లవారక ముందే గ్రామాల్లో రైతుల ముంగిట వివిధ కంపెనీల ఉద్యోగులు వాలిపోతున్నారు. రైతుకు సంబంధించిన వివరాలు, భూమి ఎంత ఉందని, ఎలాంటి పంటలు వేస్తారని మాట్లాడి పరిచయం చేసుకుంటారు. మీరు వేస్తున్న దాంట్లో ఎకరం పంటకు తాము విక్రయిస్తున్న వాటిని వాడాలని ముందుగా కోరుతారు. మీకు మంచి దిగుబడి వస్తుందని నమ్మబలుకుతారు. పేరు రాసుకుని అడ్వాన్స్ ఇస్తే మీకు కావాలసిన రోజున ఆటోలో తీసుకు వచ్చి మందులను అందజేస్తామని చెప్పి రైతులకు నాణ్యతలేని మందులను అంటగడుతున్నారు.

ముందుగానే గోదాం ఏర్పాటు

గ్రామాల్లో రైతుల పంటలకు మందులు విక్రయించేందుకు ముందుగానే వారికి అనుకూలమైన చోట ఒక గోదాంను ఏర్పాటు చేసుకుంటారు. అది ఎవరి కంట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. తీసుకున్న గోదాంకు వారికి అనుకూలమైన సమయంలో స్టాక్ దింపుకుంటారు. రైతుల వద్ద ఆర్డర్ తీసుకున్న తర్వాత గోదాం నుంచి గ్రామాలకు పురుగు మందులు, విత్తనాలను తీసుకెళ్లి అందజేస్తారు.

ఆర్డర్ తీసుకున్న సమయంలో ఫోన్ నెంబర్ మాత్రమే ఆధారం

గ్రామాలకి వచ్చే వ్యక్తులు మందులు విక్రయించేందుకు రైతుల వద్ద డబ్బులు తీసుకుని ఎలాంటి రశీదులు ఇవ్వకుండా ఒక ఫోన్ నెంబర్ మాత్రమే ఇచ్చి వెళ్తారు. గ్రామాల్లోనే కాకుండా రైతుల యొక్క వ్యవసాయ పొలాల వద్దకి వెళ్లి రైతుల వద్ద ఆర్డర్ తీసుకుని వెళ్తుంటారు.

జిల్లాలో ఎక్కువగా వరి పంట సాగు

జిల్లా వ్యాప్తంగా రైతులు తమకున్న భూమిలో ఎక్కువ శాతం వరి పంటనే సాగుచేస్తున్నారు. కొన్ని మండలాల్లో మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవనుండగా.. అందులో ఎక్కువగా వరి 3 లక్షలకుపైగా సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దోమకొండ, బీబీపేట మండలాల్లో సీజన్ ప్రారంభమైందంటే చాలు పురుష ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు సైతం

(మిగతా 8వ పేజీలో)

ఘనంగా రైతు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

నిజామాబాద్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి ఎన్.శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడుతూ సహకార ఉద్యమ చరిత్ర దాని ప్రస్తుత పురోగతి మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థల యొక్క స్థాపన, విధివిధానాలు, నిర్వాహక పద్ధతులు, రైతులకు లభించే ప్రయోజనాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరస్వతి, రిజిస్ట్రార్ పోశన్న, క్లస్టర్ ఆఫీసర్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు దాసరి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు పోతరెడ్డి, డైరెక్టర్లు సాంబశివరావు, జనార్ధన్, వంగ రవీందర్, మోజీరామ్, 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రమోద్‌కుమార్, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపులలో దొడ్డు బియ్యం నిల్వలు



నవీపేటలో ఓ రేషన్ షాప్‌లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

నవీపేట,మే24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుండి రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. గతంలో పంపిణీ కోసం వచ్చిన దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలలో మూలనపడి ఉన్నాయి. మండలంలో 37రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో సుమారు 312క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. గత మూడు మాసాలుగా సంబంధిత బియ్యం సంచులు మూలనపడి ఉండడంతో బియ్యం పురుగులు పడుతున్నాయని డీలర్లు వాపోతున్నారు. పైగా కేంద్ర ప్రభుత్వం వచ్చే జూన్ మాసం నుండి మూడు నెలలకు సరిపడ బియ్యాన్ని ఒకేసారి విడుదల చేస్తామని పేర్కొనడంతో సంబంధిత బియ్యం ఎక్కడ నిల్వ ఉంచుకోవాలో తెలియడం లేదని డీలర్లు పేర్కొన్నారు. ఈ విషయంపై మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ కుమార్‌ను వివరణ కోరగా రేషన్ షాపులలో గత మూడు మాసాల క్రితం వచ్చిన దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయని జిల్లాలోని చాలా మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబంధిత బియ్యాన్ని తరలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బోధన్ డివిజన్‌లో భారీ వర్షం





లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో కురుస్తున్న వర్షానికి పట్టణంలోని పలు వార్డులలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇది వరకే మున్సిపల్ అధికారులు డ్రైనేజీలు కట్టడంతో ఈ సారి వర్షాలకు నీరు డ్రైనేజీలోకి వెళ్లడంతో వర్షపు నీరు రోడ్లపై పారుతుంది. రాకాసిపేటలోని లోతట్టు ప్రాంతాల్లోని శివారు లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. వర్షానికి శర్బత్ కెనాల్ పొంగిపొర్లడంతో మున్సిపల్ సిబ్బంది శర్బత్‌కెనాల్‌లోని చెత్తచెదారాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ సమక్షంలో చేపట్టారు. పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈ యోగేష్ సందర్శించారు. వర్షానికి ఎక్కడ కూడా నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. బోధన్ డివిజన్‌లో భారీ వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు భారీ వర్షం పడడంతో బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాలలో వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులుగా వర్షం పడడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసిన రైతులు పంటలు వేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బోధన్ డివిజన్‌లో రెంజల్ మండలంలో 28.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోటగిరిలో 15.2మిల్లీ మీటర్లు, బోధన్‌లో 22.6మిల్లీ మీటర్లు, వర్నిలో 13.0మిల్లీ మీటర్లు, మోస్రా 14.4మిల్లీ మీటర్లు, ఎడపల్లిలో 31.0మిల్లీ మీటర్లు, రుద్రూరులో 26.6మిల్లీ మీటర్లు, చందూర్‌లో 20.0మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కల్వకుంట్ల కుటుంబం కాదు.. కలహాల కుటుంబం

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ఆర్మూర్ రూరల్ , మే 24(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది కల్వకుంట్ల కుటుంబం కాస్త కలహాల కుటుంబంగా మారిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం ఆలూర్, ఆర్మూర్‌లలో కాంగ్రెస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గత పాలనలో 10ఏళ్లలో లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీని సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం అవివేకం అన్నారు. గతంలో వారి హయాంలో కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించారని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ జీవన్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, అయ్యప్ప పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ తోటలో వేలాడుతున్న కరెంట్ వైర్లు

మోర్తాడ్, మే 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టక్కురి వాడ శివారులో ఆయిల్‌ఫామ్ తోటలో కరెంట్ వైర్లు వేలాడుతుండడంతో రైతులు భయపడుతున్నారు. స్థానిక రైతు పుప్పాల అశోక్‌కు చెందిన ఆయిల్ ఫామ్ చెట్లకు తగిలేలా వైర్లు తాకుతున్నాయని దీంతో ఎర్తింగ్ వస్తుందని రైతు వాపోయాడు. విద్యుత్ అధికారులకు పలుమార్లు వారి దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకోవడం లేదని అశోక్ ఆరోపించారు. తోటలోకి వెళ్లాలంటేనే భయం కలుగుతుందని ఆయిల్ చెట్లకు నీరు పారించాలన్న భయం కలుగుతుందని రైతు వాపోయారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం బోధన్‌లోని ఇందూర్ బీఈడీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాల అభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుటకు, బడిబాట కార్యక్రమం క్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రతి నెలలో ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. జూన్ 6 నుంచి బడిబాట నిర్వహించాలని పాఠశాల ప్రారంభంలో సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, డీఆర్‌పీలు వెంకటేశ్వర్లు, హన్మాండ్లు, రిసోర్స్ పర్సన్‌లు సంజీవ్, శ్రీకాంత్, శ్రీహరి రెడ్డి, శ్రీధర్, పీరాజీ, సీఆర్‌పీలు విజయ్, యుసుఫ్ బాబు, విజయ, దేవానంద్, రేఖ, మండలంలోని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు లేకుండా చూడాలి

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని 4వ వార్డు ప్రజలు బోధన్ సబ్ కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సొంత ఇల్లు ఆర్‌సీసీ ఉండి ఫోర్ వీల్లర్ కారు ఉన్న ఒక్క ఇంట్లోనే రెండు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రజల అభ్యర్థన మేరకు సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జాదవ్ ప్రవీణ్, ఉస్మాన్, ఖుద్దుస్, కాలనీవాసులు గజాపాక సాగర్, ఉదయ్ కిరణ్, కనకయ్య, విజ్జు, లక్ష్మణ్ తదితరులున్నారు.

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన



పంచాయతీ కార్యదర్శిని ఘెరావ్ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బికనెల్లి గ్రామంలో వారం రోజులుగా తాగునీరు లేక అల్లాడుతున్నామని శనివారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామంలో రెండు బోరు మోటార్లు చెడిపోయ్యాయని, దీంతో తాగునీటికి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారని అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో విసిగిపోయిన గ్రామస్థులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. పంచాయతీ కార్యదర్శిని ఘెరావ్ చేశారు. తక్షణమే స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని లేనియెడల సబ్ కలెక్టర్ వద్దకు వెళ్లి తమ సమస్యలను విన్నవించుకుంటామన్నారు. ఒక పక్క వర్షాలు పడుతున్న అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరో పక్క తాగడానికి నీరు లేకపోవడం గ్రామాధికారులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోరు మోటార్లను వెంటనే రిపేర్లు చేయించి గ్రామస్థులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

పెర్కిట్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల చీమన్‌పల్లి యందు 2025- 26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిచనున్నారు. ప్రిన్సిపాల్ సోమ్లా ఒక ప్రకటనలో తెలుపుతూ ఎంపీసీ, బైపీసీలలో మిగిలిన సీట్ల భర్తీ కొరకు 26వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పైకప్పు పెచ్చులూడిపడి బాలికకు గాయాలు

బాల్కొండ, మే 24(ఆంధ్రజ్యోతి): బాల్కొండ కేసీఆర్ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లలో శనివారం పైకప్పు పెచ్చులూడిపడి బాలికకు గాయాలయ్యాయి. మోహన్ అనే వ్యక్తికి చెందిన డబుల్ బెడ్‌రూంలో చిన్న పాటి వర్షానికి పెచ్చులూడడంతో ఏడేళ్ల ప్రీతికపై పడడంతో స్వల్ప గా యాలయ్యాయి.

'అవసరం మేరకే రసాయన ఎరువులను వినియోగించాలి'



పడిగెలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మంజు భార్గవి

వేల్పూర్, మే 24(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు మాత్రమే యూరియా, ఇతర రసాయనాల ఎరువులను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మంజుభార్గవి, దుర్గరాణిలు సూచించారు. మండలంలోని పడిగెల గ్రామ ప్రజాభవన్‌లో శనివారం జరిగిన రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికంగా రసాయనాల ఎరువులు వాడితే పురుగులు, తెగుల్ల ఉద్రితి పెరగడమే కాకుండా పర్యావరణ, కాలుష్యంతో పాటు పంట పెట్టుబడులు పెరిగిపోతాయన్నారు. వేసవిలో వరి ఎంట కోత తర్వాత లోతుదుక్కులు చేసుకుంటే తెగులు, పురుగుల ఉద్రితి తగ్గుతూ నేల నీటివినియోగ సామర్థ్యం పెరుగుతుందన్నారు. పంట మార్పిడి సరైనా ప్రణాళికతో చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని భూమికి దీర్ఘకాలిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. వర్షపు నీటిని కుంటల్లో నిల్వచేయడం ద్వారా పొలానికి అవసరమైన సమయంలో నీరు అందించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి రశీదు లను తీసుకొని భద్రపరిస్తే కష్టకాలంలో నష్టపరిహారం పొందవచ్చన్నారు. చెట్లు నాటడం మన జీవన వ్యవస్థకు అత్యంత అవసరమైన పని అని, ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకే కాదని భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన జీవనాన్ని అందించడానికి కీలకమైన చర్య అని అన్నారు. పచ్చి రొట్టె ఎరువుల వల్ల అనేక లాభాలు ఉంటాయని పోటాష్ ఉన్న కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే వాడాలన్నారు. గ్రామ రైతులు తమ సమస్యలను వివరిస్తూ వివిధ పంటల సాగుచేయు పద్ధతులపై తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. విత్తనశుద్ధి ప్రాముఖ్యత శుద్ధి చేసుకునే విధానాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి ఎస్. శృతి, ఏఈవోలు సాయిరాంరాజ్, ప్రశాంత్, స్నేహశ్రీ, షబీర్, మండల పశువైద్యుడు సంతోష్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొంబాయి గంగాధర్, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రుద్రూరులో కార్డన్ సెర్చ్



రుద్రూరులో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

కోటగిరి,మే24(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో శనివారం నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు కార్డెన్‌సెర్చ్ కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి 4 ఆటోలు, 97 ద్విచక్రవాహనాలు సరైన పత్రాలు లేనందున స్వాధీనం చేసుకున్నారు. ఒక ఇంట్లో అక్రమంగా లిక్కర్ అమ్ముతున్నారన్న సమాచారం మేరకు 45 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు అనుమాన స్పదంగా సంచరిస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ టౌన్, రూరల్ సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్‌ఐలు సాయన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపు లక్ష్మీనర్సయ్య (40) జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గత రేండేళ్ల క్రితం భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది గ్రామంలోని ఊరచెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్నిఎస్‌హెచ్‌వో పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అంతంపల్లిలో టిప్పర్ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

భిక్కనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపల్లి గ్రామంలో శనివారం టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగింది. గ్రామంలో విద్యుత్ సమస్య ఏర్పడింది. దీంతో గ్రామస్థులు వెంటనే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెం టనే అప్రమత్తమైన విద్యుత్‌శాఖ ఏడీ సుదర్శన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విరిగిన స్తంభాన్ని సిబ్బందితో పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించి, సమస్యను పరిష్కరించారు.

చోరీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి

కామారెడ్డిటౌన్,మే 24(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయం పక్కన గల ఓ ఇంట్లో శనివారం చోరీకియత్నించిన ఇద్దరు వ్యక్తులకు స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోరీకి యత్నించిన వారు నిజామాబాద్‌కు చెందిన అశ్రాఫ్, ముస్కాన్‌లుగా గుర్తించారు.

తండ్రిని చంపిన తనయుడు



హత్యకు గురైన ఫకీరా

లింగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం అయ్యపల్లితండాలో శనివారం రాత్రి తండ్రి ఫకీరాను గొడ్డలి తో నరికి చంపాడు కొడుకు. తండా వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అయ్యపల్లితండాకు చెందిన దేవాసోత్ ఫకీరా(46)కు 20ఎండ్ల కిందట ఫంగీతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ప్రకాశ్‌తో పాటు కూతురు ఉన్నారు. ఫకీరా ఇటీవల కూతురు వివాహం జరిపించినట్లు వారు తెలిపారు. ఫకీరా భార్య ఫంగీ మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో ఫకీరా రెండోవివాహం చేసుకోవడానికి సిద్ధపడగా కొడుకు ప్రకాశ్ అడ్డుకున్నాడు. తండ్రి వివాహం విషయంలో తండ్రి కొడుకుల మధ్య సంవత్సర కాలంగా ప్రతీ రోజు గొడవ జరుగుతుందని వారు తెలిపారు. తనకు వివాహం చేయాల్సి ఉండగా తండ్రివి నువ్వు వివాహం చేసుకోవడం ఏమిటని ఘర్షణ పడేవాడు. ఘర్షన పడ్డ ప్రతీసారి సమీప బంధువులు వచ్చి నచ్చజెప్పేవారని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి సైతం తండ్రి కొడుకులు అదే విష యమై ఘర్షణ పడ్డారని వారు తెలిపారు. ఇటీవల వారు నూతనంగా ఇంటిని నిర్మించుకున్నారని తండ్రి కొడుకులు ఘర్షణ పడుతున్న సమయంలో తండ్రి ఫకీరా గ్యాస్ సిలిండర్‌కు నిప్పం టించి ఇంటిని పేల్చివేస్తానని కొడుకును బెదిరించడంతో కోపోద్రిక్తుడైన కొడుకు ప్రకాశ్ అక్కడే ఉన్న గొడ్డలిని తీసుకుని ఫకీరా తలపై నరక డంతో ఫకీరా అక్కడికి అక్కడే మృతిచెందినట్లు వారు తెలిపారు. విష యం తెలుసు కున్న తండా వాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

నవీపేట,మే24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో గత ఐదురోజులు కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులలో శిక్షణ అందించడం జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌లను ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

వర్ని : వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 57మంది ఉపాధ్యాయులకు పీఎల్‌ఎన్ శిక్షణను ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి దుర్కి సాయిలు ఆధ్వర్యంలో ఈ శిక్షణను ఇచ్చారు. విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మండల రిసోర్స్‌పర్సన్‌లు సంతోష్, రాజ్ కమల్, రఘుపతి, స్వప్న, గంగారాజు, శివాని, స్పందన, మీనా తదితరులు శిక్షణ ఇచ్చారు.

కమ్మర్‌పల్లి : విద్యార్థులకు కృత్యాలద్వార విద్యా బోధన చేసినప్పుడే మెరుగైనఅభ్యాస ఫలితాలు వస్తాయని ఆ దిశగా ప్రతిఒక్కరు కృషిచేయాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి, కోర్స్ డైరెక్టర్ ఎన్ ఆంద్రయ్య అన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించే నిమిత్తం విద్యాశాఖ అద్వర్యంలో గత ఐదురోజులగా స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



లక్ష్మాపూర్‌లో ముగ్గు పోస్తున్న దృశ్యం

మోస్రా,మే24(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థలంలో భూమిపూజ చేసి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ్డోల్ల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హైమద్, కమిటీ సభ్యులు చింతం సంజీవ్, ఎల్లప్ప, గడ్డం సాయిలు, అనురాధ, కారేగాం తండా మాజీ సర్పంచ్ దేవిసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్, కారోబార్ బాలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం లేకుండా కేసులు పరిష్కరించుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి



న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

ఆర్మూర్ టౌన్ , మే 24(ఆంధ్రజ్యోతి): కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా ఉభయుల ఒప్పందాల ప్రకారం పరిష్కరిం చుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘంలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కేసులను పరిష్కరించుకోవడంతో ఉభయులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. విశ్రాంతి ఉద్యోగులు ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,గౌరవ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, జిల్లా కార్యదర్శి కరుణసాగర్‌రెడ్డి,రాజేశ్వర్‌రెడ్డి, గంగారాం, హరినారాయణ, గంగారెడ్డి, సుధాకర్‌గుప్తా, బ్రహ్మయ్య, రవీంద్రమోహన్, ముత్తెన్న, సుదర్శన్, ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్‌న్యాయాధికారి

ఆర్మూర్ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామంలో లాలన వృద్ధాశ్రమాన్ని సీనియర్ సివిల్‌జడ్జ్ శ్రీదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఆమె వెంట బాబాగౌడ్, నివేధన్, శంకర్‌గౌడ్, వృద్ధాశ్రమ నిర్వహకురాలు సునీత, న్యాయసేవ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కోటగిరి,మే24(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. పదిహేను రోజుల పాటు యోగా, డ్యాన్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్, గేమ్స్ శిబిరం నిర్వహించడం పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ విశ్వనాథ్, సాయిలు, ప్రభాకర్, కేవీ మోహన్, రాంసింగ్ పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో గత 15రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, నృత్యాలు, డ్రాయింగ్, గానం వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణలో తాము నేర్చుకున్న పలు అంశాలు, కృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, శివ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో భజన

బీర్కూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ ఆలయ సన్నిధిలో గత సోమవారం అఖండ హరి నామ సప్తహా కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శుక్ర వారం భజన చేశారు. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగనుంది.

నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నందకిషోర్ తెలి పారు. అభ్యర్థులు ఈనెల 29 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బ్రహ్మంగారి ఆలయంలో పూజలు

గాంధారి, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా శనివారం విశ్వబ్రాహ్మణులు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కమ్మరి నాగరాజు, సీపీఎం సాయిలు, కమ్మరిసాయిలు, రమేష్, సాయి లు భజనశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నకిలీ విత్తన విక్రయాలకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో రైతులకు సీడ్స్ అమ్మకంలో పోటీ పడుతున్నారు. ఎలాంటి లైసెన్స్‌లు, బిల్లులు లేకుండానే విత్తనాలతో పాటు, గడ్డి మందులు, గంట మందులను రైతులకు విక్రయిస్తున్నారు. నాసి రకం మందులు అని తెలియక రైతులు వారిని గుడ్డిగా నమ్మి కొనుగోలు చేస్తున్నారు. తర్వాత పంట దిగుబడి రాకపోవడంతో నష్టపోయామని లబోదిబోమన్నారు.

● ముందుగానే ఆర్డర్ చేసుకుని..

జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో సీజన్ ప్రారంభమవుతుందనగానే గ్రామాల్లోకి కంపెనీల ప్రతినిధులు చేరుకుంటారు. రైతుల వివరాలను నమోదు చేసుకుని విత్తనాలు, మందులు తెప్పించి ఇస్తామని రైతులను మభ్యపెడతారు. వారు చేరుకున్న గ్రామంలో ఒకరిద్దరిని మచ్చిక చేసుకుంటారు. వారి ద్వారా వారిచ్చే మందులను ప్రచారం చేయిస్తూ దర్జాగా మందులను విక్రయిస్తుంటారు. వారు మచ్చిక చేసుకున్న వారికి ఏదో ఒక రకంగా లబ్ధి చేకూర్చుతుంటారు.

● గతంలో దోమకొండ పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో గోదాం ఏర్పాటు

అక్రమంగా సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న కొందరు అక్రమార్కులు వారికి అనుకూలంగా ఉన్నచోట గోదాంను ఏర్పాటు చేసుకుని విత్తనాలు, మందులను డంపు చేసి పెట్టుకుంటారు. గతంలో దోమకొండలోని పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో గోదాంను ఏర్పాటు చేసుకుని దర్జాగా తమ దందాను సీజన్ మొత్తం అక్కడి నుంచే నడిపించారు. తమను అడ్డుకునే వారే లేరన్నట్లు ఇష్టారీతిన మందులు, విత్తనాలను రైతులకు విక్రయించి డబ్బును వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయని ప్రజల నుంచి ఆరోపణలు ఉన్నాయి.

● లైసెన్స్ డీలర్లకు తెలిసినా పట్టించుకోని వైనం

గ్రామాల్లో అక్రమంగా విత్తనాలను ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా కొంత మంది సిబ్బంది విక్రయిస్తున్న విషయం లైసెన్స్ డీలర్లకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంటున్నారు. ఫిర్యాదును అధికారులకు ఇవ్వలేక, అక్రమంగా గ్రామాల్లో విక్రయిస్తున్న వారిని అదుపు చేయలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారే తప్ప బయటకు చెప్పలేకపోతున్నారు.

● విత్తనాల విక్రయాలపై కలెక్టర్ ఆదేశించినా..

జిల్లా వ్యాప్తంగా విత్తనాల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ప్రతీసారి ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేస్తుంటారు. రికార్డులు, రిజిస్టారులను పరిశీలిస్తారు. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమ విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ సివిల్ పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోరు.

గ్రామాల్లో విత్తనాలు, మందులు అమ్మితే కఠిన చర్యలు

● సంపత్ కుమార్, సీఐ భిక్కనూర్

రైతులు పండించే పంటలకు సంబంధించి ఎవరైన గ్రామాలకు వెళ్లి విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాలకు ఎవరైన విత్తనాలు విక్రయించేందుకు వస్తే రైతులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ప్యాకింగ్ లేకుండా ఉన్న వాటిని తీసుకోవద్దు. లేబుల్ ఉన్నవాటినే మాత్రమే కొనుక్కోవాలి. లెసెన్స్ దుకాణాల ద్వారా విత్తనాలు తీసుకుంటే క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.

గుర్తింపు ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేయాలి

● మణిదీపిక వ్యవసాయాధికారిణి, దోమకొండ

ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన విత్తనాలు, మందుల దుకాణాల్లోనే రైతులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి సంబంధించి రశీదును రైతులు తీసుకోవాలి. తీసుకున్న రశీదును పంట చేతికి వచ్చేంత వరకు భద్రంగా పెట్టుకోవాలి. ఎవరైన నకిలీ విత్తనాలను అమ్మితే తమకు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచబడుతాయి.

తనిఖీలు నిర్వహిస్తాం

● స్రవంతి, ఎస్సై, దోమకొండ

మండల పరిధిలో ఉన్నటు వంటి ముత్యంపేట, దోమకొండ, అంబార్‌పేట గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్‌ను సంబంధిత శాఖ అధికారులతో కలసి తనిఖీలు చేస్తాం. విత్తనాలు, మందులు తయారైన తేదీలను చూస్తాం. అధీకృత లైసెన్స్ డీలర్ నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి. గుర్తింపు లేని వారు ఎక్కడైన అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లోకి ఎవరైన వ్యక్తులు వచ్చి విత్తనాలు, మందులు విక్రయిస్తే వారి వద్ద ఎలాంటివి కొనుగోలు చేయవద్దు వెంటనే తమకు సమాచారం అందించాలి.

టీఎస్ పాలిసెట్‌లో భిక్కనూరు విద్యార్థుల ప్రతిభ



462 ర్యాంకు సాధించిన రుషికేష్



1076 ర్యాంకు సాధించిన విగ్నేష్‌గౌడ్



1480 ర్యాంకు సాధించిన కౌశిక్‌యాదవ్

భిక్కనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): టీజీ పాలిసెట్ ఫలితాల్లో భిక్కనూరు విద్యార్థులు ప్రతిభచూపారు. భిక్కనూరు శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రుషికేష్(ఎంపీసీ) రాష్ట్రస్థాయిలో 462వ ర్యాంకు, పి.విగ్నేష్‌గౌడ్ 1076వ ర్యాంకు, కౌశిక్‌యాదవ్(బైపీసీ) 1480వ ర్యాంకు సాధించారని కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సి పాల్ ఆశోక్‌యాదవ్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.



పావని

ఎల్లారెడ్డి : శనివారం విడుదల అయిన పాలీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలలో ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌కు విద్యార్థిని పావని పాలిసెట్ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో బైపీసీ విభాగంలో 573 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద విధులను సక్రమంగా నిర్వర్తించాలి



భిక్కనూరులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని డీవీఏహెచ్‌వో భాస్కరన్ అన్నారు. భిక్కనూరు టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానిత ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, ఏ వాహనంలోనైనా ఆవులు ఉంటే వాటిని వెంటనే గోశాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి దేవేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు

మహమ్మద్‌నగర్,మే 24 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ, గాలిపూర్ గ్రామాల్లోని వరి విత్తనాల దుకాణాలను ఏవో నవ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలనిల్వలను, స్టాక్‌రిజిస్టర్‌లను ఆయా దుకాణాలలో పరిశీలించామని తెలిపారు. దుకాణదారులు ఇచ్చిందే తీసుకొచ్చి విత్తనాలు చల్లితే తర్వాత నారుమల్లు పెరిగాక, దిగుబడి సరిగా రాక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీంతో ముందుగానే విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్‌రిజిస్టర్‌లు, విత్తనాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరుపేదలకు ఇళ్లు కట్టించడానికి సిద్ధంగా ఉన్నాం

- అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- దళారులకు డబ్బులు ఇవ్వొద్దు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం

బాన్సువాడటౌన్ , మే 24 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలందరికీ ఇల్లు కట్టించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో గ్రామాల వారిగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్ల కేటాయిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎవరి ప్రమేయం ఉండదని, పూర్తిగా పారదర్శకంగా ఉంటుందన్నారు. లబ్ధిదారులు కూడా బిల్లుల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దన్నారు. పేదోడికి గూడు కట్టించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సొంత స్థలం ఉన్నవారు ఇళ్ల కట్టుకోవడానికి ముందుకు వస్తే బిల్లులు వెంట వెంటనే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. అంతేకాకుండా గతంలో గృహలక్ష్మీకి దరఖాస్తు చేసుకుని ఇళ్ల కట్టుకున్న వారికి బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని కోటగల్లీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి లబ్ధిదారునికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ , నాయకులు జంగం గంగాధర్ , ఎర్వల కృష్ణారెడ్డి , ఖాలేక్ , రోహిత్ , నార్ల సురేశ్ , చిన్న మోతీలాల్ , ఏజాస్ , నార్త రవీందర్ , మున్సిపల్ కమీషనర్ శ్రీహరిరాజు తదితరులున్నారు.

నసురుల్లాబాద్ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులు ఇండ్లను నిర్మించు కోవాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో అధికారులు, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలను కలిపి మొత్తం 320 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ నసీమ, పంచాయతీ సెక్రెటరీ రాజేష్, గ్రామస్తులు కంది మల్లేష్, చెంపోట్‌రైటప్: 302ఆర్‌ఎంఆర్24: శ్రీ కాలభైరవ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దోమకొండ :అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో పలు ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణం జరుగుతున్నప్పుడు ఆరు దశలలో రూ.లక్ష చొప్పున ఆరుదశలలో బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు నల్లపు శ్రీనివాస్, నర్సింలు, శంకర్, నరేష్, నయీం, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణానికి పూజ చేస్తున్న అధికారులు



నియామకపత్రం అందజేస్తున్న ఈఓ

బంజార సోదరులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

పెద్ద కొడప్‌గల్, మే 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల బంజారాలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పౌరపీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బేగం పూర్ తండాలో జరిగిన భోగ్‌బండార్ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరై తండావాసులకు తన ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా బాబుసింగ్ మహరాజ్ మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా బంజారా సమాజం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావం కల్గిఉండి సేవా నిరతిని చాటాలని సూచించారు. దీంతో పాటుగానే ప్రతిఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆలయం వద్ద హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హెచ్ఐవీపై అవగాహన

దోమకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ మానిటరింగ్ కో-ఆర్డినేటర్ రాణి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ శ్రీవిద్య హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్, మాజీ సర్పంచ్ నరేష్, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'సకాలంలో జిలుగ, పెద్దజనుము విత్తనాలను సరఫరా చేయాలి'

సదాశివనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సకాలంలో సహకార సంఘాల ద్వారా జిలుగు, పెద్దజనుము విత్తనాలను సరఫరా చేయాలని ఉమ్మడి సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిజామాబాద్ జిల్లాలోని సహకార సంఘాలలో జిలుగ, పెద్దజనుము విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారని, అదే కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు ఏ సహకార సంఘానికి కూడా ఈ విత్తనాలను సరఫరా చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకుడు కలాలి సాయాగౌడ్, మాజీయూత్ అధ్యక్షుడు శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎండిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించాలని తహసీల్దార్ గంగాసాగర్ అన్నారు. మండలంలోని కుప్రియాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం కలగకుండా తూకం వేయాలని, తేమశాతం సరిపడా వచ్చిన ధాన్యాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తూకం వేసి అదేరోజు రైస్ మిల్లుకు పంపేందుకు కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ

భిక్కనూరు : అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని డీఎల్‌పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటా అయిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. . కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సిద్దరాములు, గ్రామపంచాయతీ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

బీర్కూర్ : మండల కేంద్రంలో శుక్ర వారం వ్యవసాయ శాఖ అధికారులు 50 శాతం రాయితీపై రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని సహకార సంఘం గిడ్డంగిలో జీలుగ విత్తనాల బస్తాలను నిల్వచేసి ఉంచారు. ఈ మేరకు ఏవో కార్తీక్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, విండో కార్యదర్శి విఠల్‌లు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై 30 కిలోల జీలుగ బస్తా ధర రూ. 2,137లకు రైతులకు విక్రయిస్తు న్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. విత్తనాలు పొందడానికి రైతులు తమ పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ప్రతులు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఐటం

నాగిరెడ్డిపేట : మండలంలోని విత్తన , ఎరువుల డీలర్లు తమ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నాసిరకమైన విత్తనాలను, ఎరువులను విక్రయించినట్లయితే అట్టి డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ హెచ్చరించారు. ఆయన శనివారం మండలంలోని తాండూర్ ,ధర్మారెడ్డి గ్రామాల్లోని విత్తన ,ఎరువుల షాపులను తనిఖీ చేశారు. షాపుల్లోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ ఉన్న విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. రైతులకు బిల్లులు ఇవ్వకుంటే అట్టి డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చిన స్టాక్‌ను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లలో డీలర్లు నమోదు చేయాలని కోరారు. రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆయన కోరారు.

శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఈవో



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాజు

బాన్సువాడటౌన్ , మే 24 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మండలం బోర్లం గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంఈవో నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు. బాన్సువాడలో అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఈవో రాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి గాను అనుమతుల దరఖాస్తు గడువు ముగిసిందని స్పష్టం చేశారు. ఆయన వెంట బాన్సువాడ ఎంఈవో తదితరులున్నారు.

రామారెడ్డి : బాధ్యతాయుతంగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ నిట్టూరి ఆనంద్ రావు పేర్కొన్నారు. శిక్షణ ముగింపు శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఎమ్మార్పీలు రాజు, ఎల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో బోధన అందించే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధన అందించాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్‌ పర్సన్ లింగం, కళ్యాణ్, బక్షిరాం, సీఆర్‌పీలు గోపాల్, రాములు

దోమకొండ :మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా మండల కోర్సు డైరెక్టర్ మాణిక్యం శర్మను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాటరీలు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్ట్, రిమాండ్

భిక్కనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): భిక్కనూ రులో గత కొంతకాలంగా ట్రాక్టర్, డీసీఎం వాహనాల నుంచి బ్యాటరీలను, ద్విచక్రవాహ నాలను దొంగిలిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భిక్కనూరు పట్టణానికి చెందిన బల్లనరేష్ గత కొంతకాలంగా వ్యస నాలకు అలవాటు పడటంతో పాటుగా సుల భంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో కొంత కాలంగా ఆరుబయట పార్కింగ్ చేసిన డీసీఎంలు, ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను, ద్విచక్ర వాహనాలను, సీసీ కెమెరాలను దొంగిలిం చాడ ని తెలిపారు. ఈ మేరకు అతడిని విచారించగా చోరీ చేసి నట్లు అంగీకరించాడని, అతడి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు బ్యాటరీలు, సీసీ కెమెరాను స్వాధీ నం చేసుకున్నామన్నారు.



భిక్కనూరులో కేసు వివరాలను వెల్లడిస్తున్న దృశ్యం

ఏఎస్ఐని సన్మానించిన బీజేవైఎం నాయకులు

పెద్ద కొడప్‌గల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాములుకు ఇటీవలే ఎస్ఐగా పదోన్నతి లభించింది. దీంతో శనివారం మండల బీజెవైఎం ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఐగా పదోన్నతి పొందిన రాములును సన్మానించారు. ఈ సందర్భంగా మండల బీజేవైఎం అధ్యక్షులు సుభాష్ మాట్లాడుతూ ఏఎస్ఐగా రాములు పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో అందరికి అందుబాటులో ఉంటూ ప్రజలసమస్యల పరిష్కారానికి కృషిచేశారని తెలిపారు. పోలీసుసిబ్బందితో పాటు, మండల ప్రజలతో మమేకమై సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు విఠల్, శ్రీనివాస్, సంజీవ్ పటేల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదిలో నీట మునిగి వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): తమ గేదెలు మేత మేసుకుంటూ వెళ్లి మంజీరా నది అవతలి ఒడ్డుకు వెళ్లడంతో వాటిని ఇంటికి కొట్టుకురావడానికి మంజీరా నది దాటుతుండగా వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని చీనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీనూరు గ్రామానికి చెందిన ఎనగండ్ల మొగులయ్య (47) తనకు ఆరు గేదెలు ఉండగా రోజులాగే తమ గేదెలను శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని మంజీరా నది ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లాడు. గేదెలు మేత మేసుకుంటూ వెళ్లి మంజీరా నది అవతలి ఒడ్డు కుర్తివాడ శివారులోకి వెళ్లాయని, దీంతో తమ గేదెలను ఇంటికి కొట్టుకుని రావడానికి ఎనగండ్ల మొగులయ్య మంజీరా నది నీటిలోంచి అవతలి ఒడ్డుకు దాటుతుండగా మంజీరా నదిలో నీటి లోతు ఎక్కువగా ఉండడంతో లోతు తెలువక ప్రమాదవశాత్తు మంజీరా నది నీటిలో మునిగిపోయినట్టు ఎస్సై తెలిపారు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రోని గోపాల్, మేకల పోలు రాజ్‌లు మంజీరా నదిలోకి వెళ్లి గాలించగా మొగులయ్య మృతదేహం లభ్యం అయిందన్నారు. గ్రామస్తుల సహాయంతో మొగులయ్య మృత దేహాన్ని నీటిలోంచి వెలికి తీశామన్నారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు, కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య



మృతిచెందిన సునీల్



మృతిచెందిన జ్యోతి

బిచ్కుంద,మే 24(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళి సునిల్ (26) మృతి చెందినట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మద్నూర్ మండలం పెద్దతడుగూరు గ్రామం నుంచి సుని ల్ తన భార్య జ్యోతిని తీసుకుని బిచ్కుందకు వస్తుండగా పిడుగు మైసమ్మ వద్ద బైక్ మీద నుంచి కింద పడి జ్యోతి మృతిచెందింది. భార్య మృతితో మన స్థాపానికి గురైన సునిల్ మరుగుదోడ్డిలోని యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో కుటుం బీకులు గమనించి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సునీల్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి సంగ్రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కకాటుతో మహిళ మృతి

దోమకొండ, మే 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముత్యంపేట గ్రామంలో కుక్కకాటుతో ఒక మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. ముత్యంపేట గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చింపాల్ల రేణమ్మ(38) గత పదిహేను రోజుల క్రితం ఉదయం ఇంటి ముందు వాకి లి ఊడుస్తుండగా ఊర కుక్క ఆకస్మాత్తుగా వచ్చి రేణమ్మను ముఖంపై కరవడంతో ఆమె అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రత్యేక కుక్కల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త రాజు, దేవిక, దివ్య, సందిప్ అనే ముగ్గురు పిల్లలున్నారు.



మృతిచెందిన చింపాల్ల రేణమ్మ(ఫైల్)

పదోన్నతి పొందిన ఏఎస్ఐని అభినందించిన ఎస్పీ

కామారెడ్డిటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): రాజంపేట పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంజీవులు ఏఎస్ఐగా పదోన్నతి పొందడంతో ఆయనను ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. అనంతరం స్టార్‌ను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను కలిగిస్తాయని, పదోన్నతి పొందిన సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. క్రమశిక్షణతో పనిచేసే అధికారులకు తగిన గుర్తింపు, గౌరవం పోలీసుశాఖలో ఎప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



పదోన్నతి పొందిన ఏఎస్ఐతో ఎస్పీ

పరారీలో ఉన్న వ్యక్తి పట్టివేత..

దేవునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో కేసు నమోదై పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. 2023లో హర్షద్‌అలీ అనే వ్యక్తి ఢిల్లీ నుంచి బెంగళూర్‌కు బాస్మతి రైస్‌ను లారీలో తీసుకువెళ్తు మార్గమధ్యలో రూ.3.5 లక్షలకు విక్రయించి, ఖాళీ లారీని దేవునిపల్లి పీఎస్ పరిధిలోని పొందుర్తి వద్ద వదిలిపెట్టి పరారయ్యాడని తెలిపారు. ఈ సంఘటనలో హర్షద్‌అలీపై కేసు నమోదు అయిందని తెలిపారు. రెండు సంవత్సరాలుగా నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడని తెలిపారు. ఏఎస్ఐ నర్సింగ్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ రవికుమార్, రవికిరణ్‌లు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి నిందితుడిని గుర్తించి పట్టుకున్నారని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - వర్షం
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - సింగిల్
వెంకటేశ్వర - నిశ్శబ్ద ప్రేమ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

